# నేటి ప్రస్థానం

RNI : APTEL/2013/54506

తెలుగు దినపత్రిక

ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్ | శనివారం 29 మార్చి 2025 | సంపుటి : 12 | సంచిక : 19 | పేజీలు : 8 | వెల : 4/-


## కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అశాంతి



3 లో..



# మయన్మార్, థాయిలాండ్‌లో భూకంపం

## భూకంపం తాకిడికి 167 మంది దుర్మరణం

- రిక్టర్ స్కేల్‌పై 7.7గా నమోదు
- 300కు పైగా గాయపడ్డారని సమాచారం
- చైనాలోనూ పలు భవనాలు నేలమట్టం
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- బ్యాంకాక్ పర్యటనలో ఎమ్మెల్యే మక్కన్ సింగ్
- భూకంపం నుంచి బయటపడ్డట్లు సమాచారం
- భూకంపాలనూ ప్రధాని మోడీ ఆరా
- మయన్మార్, థాయిలాండ్ దేశాలకు బాసట

మయన్మార్, థాయిలాండ్ దేశాలు శుక్రవారం భారీ భూకంపం తాకిడికి విలవిలలాడాయి. రిక్టర్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 7.7గా నమోదైంది. భూకంపం ధాటికి మయన్మార్‌లో 167 మంది మరణించారు. 300 మందికిపైగా గాయపడ్డారు. భారీ భవనాలు నేలమట్టం కాగా, శిథిలాల కింద వందలాది మంది చిక్కుకున్నట్లు వార్త కథనాలు వెలువడతున్నాయి. జనం వీధుల్లో, రోడ్లపైనే బిక్కుబిక్కుమంటూ గడుపున్నారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న ఒక ఎత్తైన భవనం కుప్పకూలినప్పుడు కనీసం ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందగా, 90 మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది.





# హోదా ఇవ్వలేం

## తెలంగాణకు కేంద్రం షాక్

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు జాతీయ హోదా ప్రతిపాదన తిరస్కరణ
- ఏపీతో వివాదం నేపథ్యంలో పరిగణనలోకి తీసుకోలేమని వెల్లడి

**హైదరాబాద్, మార్చి 28 :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. కృష్ణా నదీ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుత వివాదం సుప్రీంకోర్టులో ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్2 ఇందుకు సంబంధించిన విచారణ చేపడుతోందని కేంద్ర జలశక్తి శాఖ అధికారులు ప్రస్తావించారు. కోర్టు వివాదం నేపథ్యంలో ఈ ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రజల్‌శక్తి శాఖ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్రానికి తిరిగి

మిగతా 2 లో



# అర్హులందరికీ కార్డులు, సన్నబియ్యం

- త్వరలోనే ఉప్పు, పప్పు, ఇతర సరుకులు కూడా..
- హామీ నిలబెట్టుకుంటున్నాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

03

అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్నబియ్యం ఇస్తామన్న వాగ్దానానికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా అడుగులు వేశామని అన్నారు. త్వరలోనే పప్పు, ఉప్పు లాంటి ఇతర సరకులు ఇస్తామని అన్నారు.



# విషాదం

- ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారుల అనుమానాస్పద మృతి
- తల్లి పరిస్థితి విషమం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ


02



## టన్నెల్‌లో మరో మృతదేహం గుర్తింపు

- రెండు బాడీలు తీసేందుకు రెస్క్యూ బందాలు
- బురద, సున్నం మట్టితో ఇబ్బందులు

02



## జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదుకు నో

- పిటిషన్ తిరస్కరించిన సుప్రీం



02



# మరో పరువు హత్య

- కూతురిని ప్రేమించాడని యువకుడి హత్య
- గొడ్డలితో కిరాతకంగా నరికి చంపిన యువతి తండ్రి
- పుట్టినరోజు నాడే మృతి..
- పెద్దపల్లి జిల్లాలో విషాదం

పుట్టినరోజు నాడే యువకుడిని తన కుమార్తెని ప్రేమిస్తున్నాడనే నెపంతో యువతి తండ్రి దారుణంగా గొడ్డలితో నరికి చంపాడు. ఈ హత్య ఘటన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో జరిగింది. ఈ విషయంపై మృతుడి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

02



## కొత్త బండి 2 హెల్మెట్లు

- బండి కొనేప్పుడే అంటగట్టే ఆలోచన

02

## బెట్టింగ్ యాప్స్‌కు నిర్మూలనకు సజ్జనార్‌కు కీలక బాధ్యతలు

02



## తెలంగాణకు కేంద్రం షాక్

మొదటి పేజీ తరువాయి

పంపినట్లు లోక్‌సభలో కేంద్రం తెలిపింది. 2022 సెప్టెంబర్‌లో ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి ప్రతిపాదనలు పంపిందని కేంద్ర ప్రభుత్వం గుర్తుచేసింది. 2024 డిసెంబర్‌లో ఈ ప్రతిపాదనలు తిప్పి పంపామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు విషయంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్న అడిగారు. ఈ ప్రశ్నకు జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదుకు నో

**న్యూఢిల్లీ, మార్చి 28 :** జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారంనాడు కొట్టివేసింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు త్రిసభ్య కమిటీ విచారణ జరుపుతున్నందున ఈ దశలో ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించలేమని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ వర్మ బదిలీని కేంద్ర నోటిఫై చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తన నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు కనిపించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంలో మరీ కీలక పరిణామం చోటు చేసుకుంది. దీనిపై ఒకవైపు సీజేఐ ఏర్పాటు చేసిన కమిటీ విచారణ జరుపుతుండగానే, అలహాబాద్ హైకోర్టుకు ఆయనను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం నోటిఫై చేసింది. భారత రాజ్యాంగంలోని 222వ నిబంధనలోని క్లాజ్ వన్ ద్వారా రాష్ట్రపతి తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకుని భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపులు జరిపి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలాహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలనే సిఫారసు ఆమోదించారని ఆ ఉత్తర్వు తెలిపింది. జస్టిస్ వర్మ అలాహాబాద్ హైకోర్టులో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించినట్టు పేర్కొంది. జస్టిస్ వర్మపై ఆరోపణల దుమారం నేపథ్యంలో ఆయనను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల సిఫారసు చేసింది. అయితే ఈ నిర్ణయంతో అలబాహాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ విభేదించింది. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుతో సహా దేశంలోని ఏ కోర్టుకు బదిలీ చేయరాదని, ఆయనపై ఉన్న అభియోగాలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని, అభిశంసన చేపట్టాలని, ఆయన పాత కేసుల్లో తీర్పులను కూడా తిరగదోడాలని హైకోర్ట్ బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

## కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు 2శాతం డీఏ పెంపు

### కేబినేట్ ఆమోదిస్తూ తీర్మానం

**న్యూఢిల్లీ,మార్చి28:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డియర్‌నెస్ అలవెన్స్ 2 శాతం పెంచింది. డీఏ పెంపు ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. తాజా నిర్ణయంతో జూలై ఒకటి నుంచి చెల్లించాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ రేటు 53శాతం నుంచి 55శాతానికి పెరిగింది. కేంద్రం నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు కోటిమందికిపైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నది. ఇందులో 48లక్షల మంది ఉద్యోగులు, 67లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉద్యోగుల జీతభత్యాలు నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జూలైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జూలై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటు–ంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. గతేడాది అక్టోబర్‌లో దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. కేంద్రం డీఏను సరవించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.

## ఇక రెండు హెల్మెట్లు

**న్యూఢిల్లీ, మార్చి 28 :** దేశంలో నిరంతరం రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు, వాహనదారుల ప్రాణాలను కాపాడేందుకు భారత ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంది. ఈ క్రమంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు కొన్ని మార్పులను కూడా తీసుకొస్తోంది. కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కర్ కొత్త ఆలోచనతో ముందుకొచ్చారు. దీని ప్రకారం ఇకపై దేశంలో టూవీలర్లను ఖచ్చితంగా ఐఎస్ఐ సర్టిఫికేషన్ కలిగిన రెండు హెల్మెంట్లతో కలిపి విక్రయించాలని పేర్కొన్నారు. ఇదే అమలులోకి వస్తే ద్విచక్రవాహం కొనే వ్యక్తులకు బండి డెలివరీతో పాటు– రెండు హెల్మెట్లు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందిజ కేంద్ర మంత్రి గడ్కరీ ఈ విషయాన్ని దిల్లీలో జరిగిన ఆటో సమ్మిట్ కార్యక్రమంలో మాట్లాడుతూ వెల్లడించారు. ఈ ప్రతిపాదనను దేశంలోని టూవీరల్స్ హెల్మెట్ తయారీదారుల అసోసియేషన్ స్వాగతించింది.రోడ్డు ప్రమాదాలను నివారించడానికి గడ్కరీ ఆదేశం కీలకమైనదిగా తెలుస్తోంది. దేశంలో చాలా కాలంగా ఎదుర్కొంటు–న్న రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించటానికి ఇది దోహదపడే చర్యగా ఆటో రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఇదే క్రమంలో ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాలు కలిగిన హెల్మెంట్లను వాహనదారులు ఉపయోగించేలా ఇది ప్రేరేపిస్తుందని హెల్మెట్ తయారీదారుల సంఘం అభిప్రాయపడింది.

## సజ్జనార్‌కు కీలక బాధ్యతలు



**హైదరాబాద్, మార్చి 28 :** బెట్టింగ్ భూతాన్ని తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన కొందరు సెలబ్రిటీలను పోలీసులు విచారించారు. అయితే ఇలా చేయడం ద్వారా బెట్టింగ్ యాప్‌లను పూర్తిగా నిర్మూలించ లేమని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్)ను ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారు. ఈ క్రమంలో ఆర్టిసి ఎండి సజ్జనార్‌కు కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే టాక్ వినిపిస్తోంది. సిట్ గురించి అసెంబ్లీలో ప్రకటన చేసే ముందు సిఎం ఓ సమావేశం నిర్వహించారు. శాసనసభలోని ఆయన కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిజిపి జితేందర్, డిజి శివధర్ రెడ్డి, హైదరాబాద్ కమీషనర్ సివి ఆనంద్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్‌తో పాటు సజ్జనార్ కూడా పాల్గొన్నారు. దీంతో ఈ సిట్ ఏర్పాటులో సజ్జనార్‌కి కూడా కీలక బాధ్యతలు అప్పగిస్తారనే వార్తలు చెక్కర్లు కొడుతున్నాయి.

# వక్ఫ్ సవరణ బిల్లుకు వెనక్కి తీసుకోవాలి



- వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన
- వక్ఫ్ ఆస్తులపై కేంద్ర హస్తక్షేపాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింల భారీ నిరసనలు
- వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిక

**న్యూఢిల్లీ:** మైనారిటీ హక్కులను కాలరాస్తోందన్న ఆరోపణల మధ్య కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డ్ ఇచ్చిన పిలుపు మేరకు ముస్లిం సమాజం నేడు (శుక్రవారం) దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. జుమా అల్ విధా ప్రార్థనల అనంతరం ముస్లింలు దేశంలోని అనేక నగరాల్లో రోడ్లపైకి వచ్చి తమ ఆందోళనను వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డుల స్వతంత్రతకు ముప్పు వాటిల్లేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న బిల్లును ముస్లిం సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ బిల్లు వక్ఫ్ ఆస్తుల పరిపాలనను ప్రభుత్వాధీనంలోకి తీసుకురావడమే కాకుండా, ముస్లింల హక్కులను హరిస్తుందని ముస్లిం మత పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు.

### బిల్లుతో ముస్లిం ఆస్తులపై కేంద్ర ఆధిపత్యం

కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ బోర్డు బిల్లులో వక్ఫ్ భూములు, ఆస్తుల నిర్వహణపై పూర్తి నియంత్రణను ప్రభుత్వానికి అప్పగించేందుకు మార్గం సుగమం చేస్తోంది. ఇది వక్ఫ్ బోర్డుల స్వతంత్రతను దెబ్బతీస్తుందని ముస్లిం మత పెద్దలు, న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వక్ఫ్ ఆస్తులు ఎప్పటి నుంచో ముస్లిం సమాజానికి సేవలందించే దేవాదాయ ఆస్తుల వంటివి. వీటి నిర్వహణను ప్రభుత్వ అధీనంలోకి తీసుకురావడం ముస్లిం హక్కులపై కవాతం వేసినట్టే అని వారు అభిప్రాయపడుతున్నారు.

### దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు

దేశ రాజధాని ఢిల్లీ నుంచి హైదరాబాద్ వరకు, లక్నో నుంచి కోల్‌కతా వరకు దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో ముస్లింల నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. 'వక్ఫ్ ఆస్తులపై హక్కు మాకు, కేంద్రానికి కాదు', 'ముస్లిం ఆస్తులను హరిస్తే ఊరుకోం' అంటూ నినాదాలతో ముస్లిం సమాజం వీధుల్లో గళమెత్తింది. ముస్లిం మతపెద్దలు, సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వం తక్షణం బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లిం మత నాయకుల ఆధ్వర్యంలో పలు నగరాల్లో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించగా, ముస్లింల ఆదరణ భారీగా కనిపించింది.

### ఆస్తుల స్వతంత్రత కోల్పోతే మైనారిటీలకు ముప్పు

ముస్లిం మత పెద్దలు, న్యాయ నిపుణులు స్పష్టంగా హెచ్చరిస్తూ, వక్ఫ్ బోర్డులపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ తెచ్చే ప్రయత్నం మైనారిటీ హక్కులకు పునాది దెబ్బతీసే ప్రయత్నమే అని తెలిపారు. వక్ఫ్ బోర్డుల స్వతంత్రతకు ముప్పు వాటిల్లితే ముస్లింల సమాజ సేవా కార్యక్రమాలు నిలిచిపోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

### కేంద్రం వెనక్కి తగ్గకుంటే తీవ్ర పరిణామాలు

నిరసనకారులు 'బిల్లు వెనక్కి తీసుకోకపోతే దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు జరుగుతాయి' అని హెచ్చరిస్తున్నారు. ముస్లింల హక్కులను కాలరాస్తే అది దేశంలో మత సామరస్యానికి గండిపడుతుందని ముస్లిం మత పెద్దలు స్పష్టం చేశారు. 'వక్ఫ్ ఆస్తులపై ముస్లింలకే హక్కు... ప్రభుత్వానికి కాదు' అని వారు గళమెత్తారు.

### స్పందించకపోతే నిరసనలు ఉధృతం

ప్రస్తుతం కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో ముస్లిం సంఘాలు నిరసనలను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించాయి. ముస్లిం సమాజాన్ని అవమానించే ఏ చర్యనైనా ఉపేక్షించబోమని ముస్లిం నేతలు హెచ్చరిస్తున్నారు. బిల్లు వెనక్కి తీసుకునే వరకూ ముస్లింల ఆందోళనలు ఆగవు అని స్పష్టం చేశారు.కేంద్రం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతంగా మారి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ముస్లిం మత పెద్దలు హెచ్చరించారు.

## సంగారెడ్డి జిల్లాలో విషాదం



**సంగారెడ్డి, మార్చి 28 :** సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అనుమానాస్పద రీతిలో ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారులు మృతిచెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కాగా తల్లి తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.స్థానిక సీఐ నరేశ్ కథనం ప్రకారం అమీన్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో చెన్నయ్య, ఆయన భార్య రాజితలు నివాసం ఉంటున్నారు. వారికి సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8)అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. చెన్నయ్య పొట్టకూటి కోసం వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో భార్యాభర్తలతో పాటు 3 పిల్లలు ఇంట్లోనే భోజనం చేశారు. చెన్నయ్య అన్నం, పప్పు తిన్నాడు. భార్య, ముగ్గురు పిల్లలు పెరుగు అన్నం తిన్నారు. భోజనం చేసిన తర్వాత చెన్నయ్య ట్యాంకర్ నడిపేందుకు చందానగర్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి చేరుకున్నాడు. రాజిత తలుపులు తెరవగా ఆ సమయంలో పిల్లలు నిద్రపోతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రాజితకు తీవ్రమైన కడుపునొప్పి రావడం వల్ల స్థానికుల సహాయంతో చెన్నయ్య ఆమెను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. ఆ తర్వాత పిల్లలను పరిశీలించగా అప్పటికే ముగ్గురు చిన్నారులు మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెన్నయ్యది రంగారెడ్డి జిల్లాలోని తలకొండపల్లి మండలం మెడకపల్లి. బతుకుదెరువు కోసం గత కొంతకాలంగా ఆయన అమీన్‌పూర్‌లో ఉంటున్నాడు. కాగా చిన్నారుల మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ : ఘటనా స్థలాన్ని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వచ్చి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇంటి ముందు వెనుక భవనంపైన కూడా ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోపక్క భార్య పిల్లలు పెరుగన్నం తినటం, భర్త ఒక్కడే పప్పు, అన్నం తినడం అది కూడా సందేహంగా ఉంది. అయితే పిల్లల పోస్టుమార్టం రిపోర్టు వస్తే గాని ఏం చెప్పలేమని పోలీసులు చెబుతున్నారు.

### పోస్టుమార్టం రిపోర్టు వస్తే :

చెన్నయ్యకు రెండో పెళ్లి అని తెలిసినా వివాహం చేయడం తాము చేసిన పొరపాటని రాజిత తల్లి పార్వతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కూతురు రాజితతో అల్లుడు గొడవపడేవాడని గుర్తు చేశారు. ఒకసారి గొడవపడి కొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయని, రాజిత కుమారుడిని తీసుకొని తన ఇంటికి వచ్చిందని అన్నారు. ఇదే విధంగా గొడవ కొనసాగితే పిల్లలకు విషమిచ్చి తాను చనిపోతానని చెప్పిందని తెలిపింది.



## మరో పరువు హత్య

### కూతురిని ప్రేమించాడని యువకుడి హత్య

**పెద్దపల్లి, మార్చి28 :** పుట్టిన రోజే ఓ యువకుడిని యువతి తండ్రి గొడ్డలిలో అత్యంత దారుణంగా హత్య చేసిన సంఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరేళ్ల సాయికుమార్ గౌడ్ (17) వేరే సామాజిక వర్గానికి చెందిన యువతి ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయికుమార్ పుట్టినరోజు కావడంతో గ్రామశివారులో మిత్రులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్నాడు. ఇంతలో అక్కడికి యువతి తండ్రి సదయ్య చేరుకున్నాడు. సాయిపై గొడ్డలితో వేటు వేశాడు. మొదట సాయి మెడపై అమ్మాయి తండ్రి వేటు వేయగా.. తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడిని నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు పరిగెత్తాడు. అయినప్పటికీ అతడిని వదలలేదు. సాయి కుమార్‌ను కాపాడటానికి స్నేహితులు కూడా వెనకే పరిగెత్తారు. కానీ బొడ్రాయి దగ్గర మళ్లీ వరుసగా సాయిపై గొడ్డలి పోట్లు పడ్డాయి. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం సదరు యువకుడి తల్లిదండ్రులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయిని నరికిన వెంటనే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఏసీపీ కృష్ణ ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయికుమార్ పుట్టినరోజే ఇలా దారుణ హత్యకు గురికావడం గ్రామంలో కలకలం రేపింది. కాగా సాయికుమార్ సోదరి ఐదేళ్ల క్రితం డెంగీతో మృతి చెందగా, ఇప్పుడు సాయికుమార్ ఇలా హత్యకు గురయ్యాడు. దీంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరో మృతదేహం గుర్తింపు

**నాగర్ కర్నూల్, మార్చి 28 :** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు సొరంగంలో కూలిన మట్టిలో చిక్కుకుపోయి నేటికీ ఐదు వారాలు గడిచిపోయింది. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ, కేరళ పోలీస్, క్యాడవార్ డాగ్స్ వంటి రెస్క్యూ టీంలు దాదాపు 600 మంది.. మూడు స్విఫ్ట్‌ల్లో నిరంతరాయంగా సహాయక చర్యలు చేపడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. సొరంగంలో కార్మికులపై కూలిన మట్టిని తొలగించేందుకు రెస్క్యూ టీంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉబికి వస్తున్న ఊట నీటితో సొరంగమంతా బురదమయంగా మారడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. కార్మికుల మృతదేహాలను గుర్తించేందుకు అడ్డుగా ఉన్న బోరింగ్ మిషన్‌ను కటింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు లోకో ట్రైన్ ద్వారా శకలాలను బయటకు పంపిస్తున్నారు. ఇటీవల లభ్యమైన మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో మరో డెడ్ బాడీ ఉన్నట్లు గుర్తించిన రెస్క్యూ బృందాలు బయటకు తీసేందుకు శ్రమిస్తున్నాయి. కార్మికులకుపై పడిన బురద మట్టి, సున్నం మట్టి బిగుసుకుపోవడంతో మట్టిని తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కేడవార్ డాగ్స్‌ను తెప్పించి మరోసారి సొరంగంలో పరిశీలించినా దుర్వాసన వల్ల మృతదేహాలను గుర్తించకపోయినట్టు తెలుస్తుంది. శుక్రవారం ఏడున్నర గంటల ప్రాంతంలో రెస్క్యూ బృందాలు మరోమారు టన్నెల్లోకి సహాయక చర్యలు చేపట్టేందుకు బయలుదేరాయి. రెస్క్యూ బృందాలు మధ్యాహ్నం తర్వాత బయటకు వచ్చే అవకాశం ఉండడంతో మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో ఉన్న మరో వ్యక్తి డెడ్ బాడీ వివరాలు తెలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం శివశంకర్ అనే ఓ ప్రత్యేక అధికారిని నియమించింది. గత మూడు రోజులుగా ఆయన సమక్షంలోనే రెస్క్యూ బృందాలు సొరంగంలో సహాయక చర్యలు చేపడుతున్నాయి.

# కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అశాంతి

- అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్
- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని
- ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, మార్చి 28:** కాంగ్రెస్ పాలనలో ప్రజలు అశాంతిగా ఉన్నారని, ఈ పాలన ఎప్పుడు ఆగిపోతుందోనని ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. శాసనమండలిలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని అన్నారు. రాష్ట్రం అప్పులు మొత్తం రూ.4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్ధాలు చెబుతున్నామని కాంగ్రెస్ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు. ప్రజలు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల సమస్యలపై గళమెత్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి రోజూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపామని గుర్తుచేశారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్‌పై తాము చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగొచ్చిందని, ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని చెప్పారు. ప్రకటించిన విధంగా సీఎం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేసేవరకు తాము ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత అన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్నదానిలో వాస్తవం లేదని, స్వయంగా ఇరిగేషన్ మంత్రి మండలిలో ఈ విషయం చెప్పారని అన్నారు. 'నీళ్లు ఇవ్వగలిగి ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా..?' అని కవిత ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని చెప్పారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ జరుగుతుందని ఆమె తెలిపారు. మహాకుంభమేళా తరహాలో సభను నిర్వహిస్తామని అన్నారు. ఇరవై ఐదు వసంతాల బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కవిత పిలుపునిచ్చారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ప్రజల గొంతుకగా వ్యవహరించిందని అన్నారు. సమన్వయంతో అన్ని అవకాశాలను వాడుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించామని, అన్ని చర్చల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టామని కవిత చెప్పారు. ఈ మండలి సమావేశాలు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతాయని, ఈ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందాయని తెలిపారు. ఆ బిల్లుల ఆమోదానికి బీఆర్ఎస్ పార్టీ కృషి ఫలితం ఎంతో ఉందన్నారు. అసెంబ్లీ సాక్షిగా మహిళలను ఉద్దేశించి పరుష పదజాలంతో ముఖ్యమంత్రి అసభ్యంగా మాట్లాడారని, ఆ వ్యాఖ్యలు ఆయన చరిత్రలో మరకగా ఉండిపోతాయని అన్నారు.



# అర్హులందరికీ కార్డులు, సన్నబియ్యం

## త్వరలోనే ఉప్పు, పప్పు, ఇతర సరుకులు కూడా..

### ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటున్నాం.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

**నల్లగొండ, మార్చి 28 :** అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్నబియ్యం ఇస్తామన్న వాగ్దానానికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా అడుగులు వేశామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని అన్నారు. ఈ క్రమంలో ఉగాది రోజున పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు రానుందని మంత్రి ఉత్తమ్ అన్నారు. హుజూర్‌నగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 85 శాతం జనాభాకు సన్నబియ్యం అందనుంది. రేషన్ బియ్యాన్ని చాలామంది ఉపయోగించుకోవడం లేదు. దొడ్డు బియ్యం తినకుండా కొందరు బ్లాక్‌లో అమ్ముతున్నారు. అందుకే సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. బియ్యంతో పాటు త్వరలోనే పప్పు, ఉప్పు లాంటి ఇతర సరకులు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఏర్పాటు చేశాం అన్నారు. కొత్త రేషన్ కార్డులు ఎంతమందికి కావాలన్నా అర్హతను బట్టి ఇస్తున్నాం. కార్డు లేకున్నా లబ్ధిదారుల జాబితాలో పేరు ఉంటే బియ్యం ఇస్తాం. రేషన్ బియ్యంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏటా రూ.10,665 కోట్లు- ఖర్చు చేస్తున్నాయని ఉత్తమ్ తెలిపారు. ఇప్పటికే కార్డుకు అర్హుల జాబితా సిద్ధం అయ్యిందన్నారు. సిఎం రేవంత్ చేతుల మీదుగా పథకం ప్రారంభం అవుతుందని అన్నారు.

# భావస్వేచ్ఛను గౌరవించాలి

- అది ప్రాథమిక హక్కు కిందకే వస్తుంది
- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, మార్చి 28 :** కవిత్వం, నాటకం, స్టేజీ ప్రదర్శనలు, వ్యంగ్యం మరియు కళల ద్వారా భావాన్ని స్వేచ్ఛగా వ్యక్తీకరించే ప్రాథమిక హక్కుని గౌరవించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 'ఏ ఖూన్ కే ప్యాసె బాత్ సునో ' అనే కవితను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినందుకు కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గర్హిపై గుజరాత్ పోలీసులు నమోదు చేసిన కేసును శుక్రవారం కొట్టివేసింది. వాక్‌స్వేచ్ఛ మరియు భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడటానికి కోర్టులు ముందంజలో ఉండాలని పేర్కొంది. ఉదారవాద, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కులైన వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ, ప్రతి విమర్శ లేదా అసమ్మతిని తమ అధికారం మరియు స్థానానికి ముప్పుగా భావించే అభద్రతా భావంతో బలహీనం చేయకూడదని జస్టిస్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాక్ స్వాతంత్ర్యంపై సహేతుకమైన ఆంక్షలు సహేతుకంగానే ఉండాలని జస్టిస్ భుయాన్ వివరించారు. ఆంక్షలు హానికరం లేదా అణచివేతగా ఉండకూడదని, స్వేచ్ఛగా మాట్లాడే ప్రాథమిక హక్కుని ఆంక్షలు కప్పివేయలేవని జస్టిస్ భుయాన్ సూటిగా పేర్కొన్నారు. ఒక వ్యక్తి వాక్, భావ ప్రకటనా హక్కుని కాపాడటం , గౌరవించడం పోలీసుల, ప్రభుత్వాల భాధ్యత అని ధర్మాసనం ఉద్ఘాటించింది. కవిత్వం, నాటకం, సినిమాలు, రంగస్థల ప్రదర్శనలు, వ్యంగ్యం, కళలు సహా సాహిత్యం జీవితాన్ని మరింత అర్థవంతం చేస్తుందని, వ్యక్తులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తీకరించే హక్కులను గౌరవించాలని జస్టిస్ ఓకా పునరుద్ఘాటించారు. ఆరోగ్యకరమైన ,నాగరిక సమాజంలో వాక్ స్వాతంత్ర్యం అంతర్భాగమని, మెజారిటీ- వ్యక్తులు అభిమానిస్తున్నారనే కారణంతో ఒక వ్యక్తి అభిప్రాయాలను అణచివేయలేమని కోర్టు వ్యాఖ్యానించింది. పోలీసులు కూడా భిన్నాభిప్రాయాలను కాపాడాలని, అవి కూడా ప్రజాస్వామ్య విధుల్లో ఒక భాగమని కోర్టు పేర్కొంది. ఆలోచనా స్వేచ్ఛ లేకుండా భావప్రకటన లేకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 హామీ ఇచ్చిన గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం అసాధ్యం అని జస్టిస్ ఓకా పేర్కొన్నారు. పోలీసులు మరియు ప్రభుత్వం వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడటంలో విఫలమైతే కోర్టులు తప్పకుండా జోక్యం చేసుకోవాలని, పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయకుండా చూసుకోవడం కోర్టుల విధి అని పేర్కొన్నారు. కులం మతం ఆధారంగా వివిధ వర్గాల ప్రజల మధ్య శతృత్వాన్ని పెంచుతున్నారని ఆరోపిస్తూ గుజరాత్ పోలీసులు ప్రతాప్‌గర్హిపై కేసు నమోదు చేశారు. మార్చి 3 విచారణ సమయంలో ఈ కవిత అహింసను సూచిస్తుందని మహాత్మాగాంధీ స్వయంగా అనుసరించిన మార్గమని మార్చి 3న జరిగిన విచారణలో జస్టిస్ ఓకా పేర్కొన్న సంగతి తెలిసిందే.

# కాంగ్రెస్ విధానాలతో కుప్పకూలిన రియల్ రంగం

## ట్విట్టర్ వేదికగా కెటిఆర్ ఘాటు వ్యాఖ్యలు



**హైదరాబాద్, మార్చి 28 :** నగర అభివృద్ధి, రియల్ ఎస్టేట్ పరిస్థితి, ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేస్తూ, గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో నగరం సౌభాగ్యంగా ఎదిగిందని, కానీ 15 నెలల కాంగ్రెస్ పాలనలో అభాగ్యంగా మారిందని విమర్శించారు. హైదరాబాద్ నగరాభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసిందని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో నగరంలోని రియల్ ఎస్టేట్ మార్కెట్ పూర్తిగా కుంచించుకుపోయిందని తెలిపారు. పేదల ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్న ప్రభుత్వం, పెద్దల ఆస్తులతో సెటిల్మెంట్లు చేస్తోందని విమర్శించారు. గత త్రైమాసికంలో హైదరాబాద్‌లో ఇండ్ల విక్రయాలు 49శాతం తగ్గాయని, ఆఫీస్ లీజింగ్ రంగం 41శాతం క్షీణించిందని గణాంకాలతో తెలిపారు. వ్యవసాయ రంగంలో మాత్రమే కాదు, రియల్ వ్యాపారుల పరిస్థితి కూడా దారుణంగా మారిందని, కాంగ్రెస్ పాలనలో వ్యాపారస్తులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి పరోక్షంగా హితబోధ చేశారు. కూల్చడం కంటే కట్టడాన్ని నేర్చుకోవాలని, అబద్ధాల కన్నా అభివృద్ధిని ప్రోత్సహించాలని సూచించారు. 'జాగో తెలంగాణ జాగో!' అంటూ తెలంగాణ ప్రజలను అప్రమత్తం చేశారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ పరిస్థితి, హైదరాబాద్ నగరాభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై కేటీఆర్ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

### సెంట్రల్ వర్సిటీ భూముల అమ్మకం అవివేకం

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ అవివేకపూరిత నిర్ణయం వల్ల హైదరాబాద్ నగరం ఒక పెద్ద హరిత ప్రాంతాన్ని కోల్పోనుందని కెటిఆర్ రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శిస్తూ ట్విట్టర్ వేదికగా కీలక వ్యాఖ్య చేశారు. కంచే-గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. అంతేకాదు, అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఒక ప్రకటనపై కూడా ఆయన స్పందించారు. నిన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, ఆ భూమిలో ఎటువంటి జంతువులు లేవని తప్పుగా పేర్కొన్నారు. అయితే, విద్యార్థులు, అధ్యాపకుల సమాచారాన్ని ప్రకారం, హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 700కు పైగా పుష్ప వృక్ష జాతులు, 10 రకాల సస్తన ప్రాణులు, 15 రకాల సరీసృపాలు , 200కి పైగా పక్షి జాతులు నివసిస్తున్నాయి. అంతేకాదు, అక్కడి శిలా నిర్మాణాలు ఏకంగా బిలియన్ సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నాయని వివరించారు. ఈ నిర్ణయాన్ని కెటిఆర్ తీవ్రంగా తప్పుబడుతూ, ఇది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఓ విపరీతమైన నిర్ణయం. ఒక వైపు ప్రకృతి రక్షణ అంటూ మాట్లాడుతూ, మరోవైపు ప్రకృతి నాశనానికి పాల్పడటం ఆశ్చర్యకరం. ఈ భూమిని వాణిజ్య కేంద్రంగా మార్చేందుకు, భారీ భవనాలు, షాపింగ్ మాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇది నగర భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే చర్య అని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోఈ అవివేకపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను!అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# విష్ణుప్రియకు కోర్టులో చుక్కెదురు

**హైదరాబాద్, మార్చి 28 :** బెట్టింగ్ యాప్‌ల కేసులో నటి విష్ణుప్రియకు తెలంగాణ హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. మియాపూర్ పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కొట్టేయాలంటూ ఆమె హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం తెలంగాణ హైకోర్టు విచారించింది. ఎఫ్ఐఆర్ కొట్టేసేందుకు.. అలాగే ఈ దర్యాప్తుపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. అంతేకాకుండా..ఈ కేసులో పోలీసులకు సహకరించాలని విష్ణు ప్రియను హైకోర్టు ఆదేశించింది. అలాగే చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్‌లపై ప్రచారం చేసిన పలువురు నటులు, ఇన్‌ఫ్లూయన్సర్లపై మియాపూర్‌తోపాటు పంజాగుట్ట పోలీసులు పలు కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా పలువురు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. బెయిల్ పొందేందుకు పిటిషన్లు దాఖలు చేస్తున్నారు.



## దేవాదుల పైపులైన్ లీకేజీ

హైదరాబాద్, మార్చి 28: జిల్లా ధర్మసాగరం మండలం సాయిపేటలో దేవాదుల పైప్‌లైన్ లీకైంది. దీంతో ఆకాశాన్ని తాకేలా నీరు పైకి ఎగసిపడ్డాయి. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో నీరు వృధాగా పోతున్నది. ధర్మసాగర్ పంపు హౌస్ నుంచి గండిరామారం రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు పైప్‌లైన్ గుండా వెళ్తున్నాయి. అయితే విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ఫెయిల్యూర్ కారణంగా మోటార్ ట్రిప్ అయింది. దీంతో పైప్‌లైన్ పగలిపోవడంతో ఫౌంటేన్‌ను తలపించేలా భారీగా నీరు పైకి ఎగసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరు వృధాగా పోతున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కాలం చెల్లిన స్వీట్స్ రీసైక్లింగ్

- మళ్లీ కొత్తగా స్వీట్స్ తయారీ
- మల్లాపూర్ ఆమన్ స్వీట్స్ షాప్‌పై దాడి
- లైసెన్స్ రద్దు చసి, షాపు సీజ్ చేసిన అధికారులు

**హైదరాబాద్, మార్చి 28:** ప్రముఖ స్వీట్ షాపులో కూడా కల్తీ జరుగుతుందని విషయం ఇప్పుడు బయటపడింది.. ప్రముఖ స్వీట్ షాపులకు సరఫరా చేస్తున్నా తయారీ కేంద్రం పైన ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు.. ఈ సోదాల్లో భయంకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.. మల్లాపూర్ లోని అమన్ స్వీట్స్ తయారీ కేంద్రం పైన ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు.. భయంకరమైన నిజాలతో వెంటనే దానిని సీజ్ చేయడం జరిగింది.. స్వీట్ షాపుల్లో మిగిలిపోయిన లేదా కాలం చెల్లిన స్వీట్స్ ని అన్నిటిని ఇక్కడికి చేర్చి వాటితో మళ్లీ కొత్త స్వీట్స్ తయారు చేసి అదే స్వీట్ షాప్ లోకి పంపిస్తున్నారు. కాలం చెల్లిన స్వీట్స్ ని రీసైకిల్ చేసి కొత్త స్వీట్స్ పై కొత్త లేబులింగ్ చేసి తిరిగి షాపుల్లోకి స్లపై చేస్తున్నారు.. దీంతో పాటు నాసిరకం వస్తువులను వాడుతున్నారు.. అపరిశుభ్రత మధ్యలో స్వీట్స్ ను తయారుచేసి స్లపై చేస్తున్నట్లు- ఫుడ్ సేఫ్టీ అధికారుల విచారణలో బయటపడింది ..దీంతో స్వీట్ షాపు స్వీట్ కర్మగారాన్ని వెంటనే అధికారులు సీజ్ చేశారు.. దాని లైసెన్సులు కూడా రద్దు చేస్తున్నట్లు- ప్రకటించారు. మల్లాపూర్ లో అమన్ స్వీట్స్ తయారీ కేంద్రం లో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. ఈ దాడిలో, సరైన పరిశుభ్రత మరియు పారిశుధ్య నిర్వహణ లోపం, ఆహార పదార్థాల లేబులింగ్, రికార్డుల గడువు ముగిసిన ఆహార పదార్థాలను చూసి అవాక్కు అయ్యారు. గడువు ముగిసిన స్వీట్లను మళ్లీ కొత్త స్వీట్లు- తయారీలో వాడటన్ని, పరిశుభ్రత లేని ప్రదేశంలో తయారు చేయడం అధికారులు గుర్తించారు. వేరే జిల్లా లో తీసుకున్న లైసెన్సుతో మల్లాపూర్ లో పరిశ్రమను ఏర్పాటు చేయడం పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సంపాదకీయం



# నీతిమాలిన రాజకీయాలు పనిచేయవు!

ఎన్నికలంటేనే తిమ్మిని బమ్మిని చేయడం..ఎత్తులు పైఎత్తులు వేయడం....ఎదుటి వారిని బురిడీ కొట్టించడం.. అబద్దాలు చెప్పడం..ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించడం.. ఓటర్లను ప్రలోభ పెట్టడం.. ఇవన్నీ సర్వసాధారణం. మనమెంత నిజాయితీగా ఉన్నా.. ఎదుటివారు అనుసరించే ఎత్తులను గమనించి ముందుకు సాగాలి. మనం నిజాయితీగా ఉంటూనే చెడును దునుమాడే ధైర్యం కూడా సొంత చేసుకోవాలి. రాజకీయంగా మనమెంత బలంగా ఉన్నా.. ఎదుటి పక్షం మనపై నిరంతరం బురదజల్లే ప్రయత్నం చేస్తుంది. బట్టకాల్చి మీద వేస్తుంటారు... ఇలాంటి అనుభవాలు మనకు లేకున్నా భరించాల్సిందే. అయితే వీటిని దీటుగా ఎదుర్కోవాలి. గట్టిగా తిప్పికొట్టాలి. ముల్లును ముల్లుతోనే తీయాలన్న సామెతను ఆధారం చేసుకుని ముందుకు సాగాలి. ప్రజల కోసం రాజకీయంలోకి దిగిన పార్టీలు కావచ్చు..నేతలు కావచ్చు...అందుకు దీటుగా ప్రచా రాస్త్రాలను సంధించాల్సిందే.. అందుకు వారి వాదనల ను బలంగా ప్రజలకు చేరవేయా ల్సిందే. కొత్తగా నినాదాలు సిద్దం చేసుకోవాల్సిందే.. అయితే ఇదే క్రమంలో మనం చేసిన మంచిని ఒకటికి పదిసార్లు పదేపదే ప్రజల చెంతకు చేర్చాలి. అభివృద్ధి పనులను ప్రజల్లో చర్చ జరిగేలా చేయాలి. గత ఐదేళ్లలో ఏ పనికి ఎంత మొత్తం కేటాయించామో చర్చ జరిగేలా చేయాలి. ఎన్ని మంచిపనులు చేశామో లెక్కలతో సహా చెప్పగల గాలి. అలాగే అవినీతికి ఎంతగా దూరం ఉన్నామో కూడా ముఖ్యం. అలాగే అభివృద్ధి కళ్లకు కనపడు తుందా అన్నది కూడా ముఖ్యమే. అందుకే రాజకీయాల్లో విలువలకు తావులేకుండా పోతోంది. రాజకీయాల్లో విలువలు పతనం అయ్యాయి. అధికారమే పరమావధిగా అన్ని పార్టీలు భ్రమిస్తున్నాయి. తామే మంచి చేశామని, చేస్తామని చెప్పకుంటూ పబ్బం గడుపుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికార పార్టీలోకి పలుఉవరు చేరికలు ఇప్పటికే మొదలయ్యాయి. ఇంకా కొనసాగుతాయి. బిఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్‌లో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం బిఆర్ఎస్ అలుపెరుగని పోరాటం చేస్తోంది. ఉప ఎన్నికలు వస్తాయని కూడా హెచ్చరికలు చేస్తోంది. ఈ విషయంలో గతంలో ఉన్న చట్టాలే ఇప్పుడూ ఉన్నాయని, ఆనాడు లేని ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని సిఎం రేంవత్ రెడ్డి పలు సందర్భాల్లో వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ వేదికగా కూడా ఇవే వ్యాఖ్యలు చేశారు. అయితే కోర్టు తీర్పులకు, లేదా హెచ్చరికలకు స్పీకర్ లోబడి ఉండాలా అన్న చర్చ సాగుతోంది. స్పీకర్ కూడా చట్టపరమైన అధికారంలో ఉన్నవారే. అసెంబ్లీకి సంబంధించి ఆయన నిర్ణయాలకే ప్రాధాన్యం ఉన్నాయి. మని సుప్రీం తీర్పు ఎలా ఉన్నా, అధికారపక్షం మాత్రం ధీమాగా ఉంది. ఇకపోతే ఎపిలో వైకాపా నుంచి అనేకమంది జారుకున్నారు. అధికార టిడిపిలో చేరారు. అక్కడో వెసలుబాటు ఉంది. టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు మూడూ కూటమిగా అధికారంలో ఉండడంతో మూడు పార్టీల్లోనూ చేరుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న పార్టీలో చేరిపోతున్నారు. దీంతో ఏ పార్టీకి వచ్చిన నష్టం లేదు. ఎందుకంటే రాజకీయాలు ఎప్పుడూ అధికారం చుట్టే తిరుగుతాయి. అధికారం ఉన్న పార్టీకే ఆకర్శణ ఎక్కువ. సిద్ధాంత నిబద్ధతలకు ఇక్కడ తావు లేదు. అందుకే ఏ పార్టీలో గెలిచామన్న దానికి నేతలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అధికారంలో ఉన్న పార్టీలో ఉన్నామా లేమా అని లెక్కలు వేసుకుంటున్నారు. రాజకీయాల్లో నేర్చుకున్న సిద్ధాంతం ఇది. ఈ సిద్ధాంతాన్నే ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోంది. ఎపిలో కూటమి నేతలు అనుసరిస్తున్నా గతంలో కాంగ్రెస్, సిపిఐ, టిడిపి ఎమ్మెల్యేలను నిస్సిగ్గుగా టిఆర్ఎస్‌లో చేర్చుకుని తెలంగాణ పునరేకీకరణ అంటూ ప్రచారం చేశారు. ఈ సూత్రాలే ఇప్పుడు పునరావృతం అవుతుంటే బిఆర్ఎస్ భుజాలు తుడుముకుంటోంది. సిగ్గు సిగ్గు అంటూ శివాలు వేస్తోంది. కెటిఆర్ లాంటి వారు రాజకీయ బేహారులు అంటూ విమర్శలు చేస్తున్నారు.కానీ ప్రచారంలోనే అభివృద్దిని చూపి అవినీతికి,అక్రమాలకు, అధికార దుర్విని యోగానికి పాల్పడ్డ విషయాలను బిఆర్ఎస్ నేతలు కనపడకుండా చేశామని అనుకున్నారు. అయితే ప్రజలకు ఇదంతా తెలిసిపోయింది. అందుకే బిఆర్ఎస్, వైకాపా నేతల అవినీతిని, అహంకారాన్ని భరించలేక పోయారు. అధికార మార్పుతో రెండు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దీనిని జీరి÷-ణించుకుని మంచి సంప్రదాయం పాటించి మళ్లీ ప్రజల్లో పేరు తెచ్చుకుని సాగాల్సి ఉంటుంది. సామాజిక మాధ్యమాలు బలంగా ఉన్న ఈకాలంలో ప్రతి చిన్న అవినీతి, అక్రమం క్షణాల్లో ప్రజలకు చేరిపోతోంది. ప్రజల అభిప్రాయాలను తీసుకుని చేసిన మంచిని ప్రజల ముందుంచడంతో పాటు అవినీతి మట్టి అంటుకోకుండా పాలన చేయాల్సి నేతలు , అధికారం దక్కగానే అవినీతి బురదలో కూరుకుపోతున్నారు. అక్రమాలకు పాల్పడ్డారు. అవినీతిని సొంతం చేసుకున్నారు. అంతకు మించి ప్రజలతో మనకేమి సంబంధం అన్న రీతిలో వారిని దూరం పెట్టారు. ఒక సిఎం ప్రజలను కలవాల్సిన పనిలేదని అహంకారం ప్రద్శించారు. అందుకే ప్రజలు తీర్పునిచ్చారు. వారివెంట ఉన్న బలగం అంతా మెల్లగా జారుకోవడం అన్నది కూడా సహజ పరిణామం. ఇది ఏ రాజకీయ పార్టీకైనా వర్తిస్తుంది. సచ్ఛీలతతో మళ్లీ ప్రజల ముందుకు వెళ్లాలి. తమ సిద్ధాంతాలను మార్చుకోవాలి. ప్రజల కోసం పోరాటాలు చేయాలి. కానీ జగన్ అదేపనిగా విమర్శలకే పరిమితం అయ్యారు. ఐదేళ్లలో పోలవరం ముందుకు కదదలేదు. అమరావతిని పక్కన పెట్టాడు. అనేకరకమైన లిక్కర్ బ్రాండ్లతో అవినీతికి తెరలేపారు. ఇవన్నీ ప్రజల ముందున్న సజీవ సాక్ష్యాలు. అందుకే అధికారం పోవడంతో రాజరికాన్ని భరించడం,తట్టుకోవడం సాధ్యం కాదు కనక ఒక్కొక్కరే జారుకుంటున్నారు. పోరాటాలతో మళ్లీ రాటుదేలితేనే ప్రజలు వెంటనడుస్తారు.

# మయన్మార్, థాయిలాండ్‌లోభారీ భూకంపం



**న్యూఢిల్లీ, మార్చి 28:** మయన్మార్, థాయిలాండ్ దేశాలు శుక్రవారం భారీ భూకంపం తాకిడికి విలవిలలాడాయి. రిక్టర్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 7.7గా నమోదైంది. భూకంపం ధాటికి మయన్మార్‌లో 167 మంది మరణించారని, 300 మందికిపైగా గాయపడ్డారని తెలుస్తోంది. అయితే సహాయక చర్యల్లో భాగంగా శిథిలాలను తొలగిస్తున్నారు. దీంతో మరికొందరు వాటికింద ఉండే అనుమానం ఉందని భావిస్తున్నారు. భారీ భవనాలు నేలమట్టం కాగా, శిథిలాల కింద వందలాది మంది చిక్కుకున్నట్లు వార్తా కథనాలు వెలువడతున్నాయి. జనం వీధుల్లో, రోడ్లపైనే బిక్కుబిక్కు మంటూ గడుపున్నారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్ లో నిర్మాణంలో ఉన్న ఒక ఎత్తైన భవనం కుప్పకూలినప్పుడు కనీసం ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందగా, 90 మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది. సహాయక సిబ్బంది ఇప్పటి వరకు ఏడుగురిని కాపాడారు. మయన్మార్‌లోనే నిమిషాల వ్యవధిలో ఆరు భూకంపాలు సంభవించాయి. ఈ భూకంపం ప్రభావంతో భారత్, చైనా, వియత్నాం, బంగ్లాదేశ్‌లలో కూడా భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అయితే ఆయా దేశాల్లో భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4వరకు పరిమితం కావడంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. మయన్మార్ రాజధాని నేపిడా, మాండలే సహా ఆరు ప్రాంతాలు, రాష్ట్రాల్లో ఎమర్జన్సీ ప్రకటించారు. భూప్రకంపల ప్రభావంతో రెండవ పెద్ద నగరం మాండలేలో ఐకానిక్ వంతెన కుప్ప కూలిపోయింది. నగరంలో భూప్రకంపన తీవ్రత 6.4గా నమోదైంది. దేశంలో పలు చోట్ల ఎత్తైన ప్రార్థనా మందిరాలు, గోపురాలు కూలిపోయాయి. భూకంపం నేపథ్యంలో మయన్మార్ సైనిక ప్రభుత్వం అంతర్జాతీయ సాయం కోరింది. మానవతా దృక్పథంతో సాయం అందజేయాలని ప్రపంచ దేశాలకు ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. భూకంపం ప్రధాన కేంద్రం వాయవ్య నగరం సగాయింగ్‌లో 10 నుంచి 30 కిమీ లోతులో ఉన్నట్లు- యుఎస్‌జిఎస్ తెలియజేసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం భూకంపం వల్ల గణనీయ స్థాయిలో నష్టం సంభవించిందని రెడ్ క్రాస్ తెలియజేసింది. 'మానవతావాద సాయం అవసరాలపై సమాచారం ఇంకా సమీకరిస్తున్నాం' అని సంస్థ తెలిపింది. బ్యాంకాక్‌లో కుప్పకూలిన భవనం ప్రదేశం నుంచి శిథిలాలు తన ట్రక్కును బలంగా తాకినప్పుడు ఒక నిర్మాణ కార్మికుడు దుర్మరణం చెందగా, శిథిలాల కింద మరొకరు నలిగిపోయినట్లు చెప్పాడు. మొత్తం ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు, 90 మంది గల్లంతైనట్లు థాయిలాండ్ రక్షణ శాఖ మంత్రితెలిపారు. ప్రస్తుతం సాగుతున్న రక్షణ, సహాయ కార్యక్రమాల గురించి ఆయన ఇతర వివరాలు తెలియజేయలేదు. కానీ, కూలిపోయిన భవనం వెలుపల నుంచి ఇప్పటి వరకు ఏడుగురిని రక్షించినట్లు సహాయక సిబ్బంది తెలిపారు. బ్యాంకాక్‌కు ప్రముఖ చతుచాక్ మార్కెట్ సమీపంలో భవనం కూలిపోయినప్పటి వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా, టాప్‌లో ఒక క్రేన్ ఉన్న బహుళ అంతస్తుల భవనం కుప్పకూలినప్పుడు దుమ్ముధూళి వ్యాపించగా, జనం కేకలు వేస్తూ పరుగులు తీయడం కనిపించింది. భూకంపం ధాటికి భవనాలు అటూ ఇటూ ఊగిపోవడంతో జనం రోడ్లపైకి పరుగులు పెట్టారు.బ్యాంకాక్‌లో ఇతర ప్రదేశాల్లో తమ భవనాల్లో నుంచి ఖాళీ చేయించిన ప్రజలను దూరంగా ఉండవలసిందని హెచ్చరించారు

## బ్యాంకాక్ పర్యటనలో ఎమ్మెల్యే మక్కన్ సింగ్

### భూకంపం నుంచి బయటపడ్డట్లు సమాచారం



**ప్రజానావ, హైదరాబాద్:** మయన్మార్‌లో శుక్రవారం మధ్యాహ్నం భారీ భూకంపాలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ భూకంపాల ప్రభావం కారణంగా బ్యాంకాక్‌లో భారీ భూప్రకంపనలు సంభవించాయి. ఛాతుచక్ జిల్లాలోని ఓ ఎత్తైన భవనం కుప్పకూలిపోయింది. ఈ నేపథ్యంలోనే బ్యాంకాక్ టూరులో ఉన్న రామగుండం ఎమ్మెల్యే కుటుంబం తృటిలో తప్పించుకుంది. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ తన కుటుం బంతో కలిసి ప్రస్తుతం బ్యాంకాక్ టూరులో ఉన్నారు. మక్కన్ సింగ్ ఫ్యామిలీ తిరుగుతున్న ప్రదేశంలోనూ భూప్రకంపనలు సంభవించినట్లు తెలుస్తోంది. అదృష్టం కొద్దీ ప్రాణాలతో బయటపడ్డారు. అంతేకాదు.. భూప్రకంపలు వచ్చిన ప్రదేశాల్లో ఇండియాకు చెందిన వాళ్లు పెద్ద మొత్తంలో ఉన్నట్లు సమాచారం.

## ప్రధాని మోడీ ఆరా

### మయన్మార్, థాయిలాండ్ దేశాలకు బాసట

**న్యూఢిల్లీ,మార్చి28 :** భూప్రకంపనలపై ప్రధాని మోడీ ఆరా తీశారు. మయన్మార్, థాయిలాండ్ భూకంపాలపై ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మయన్మార్, థాయిలాండ్ ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలని ప్రధాని మోడీ విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరారు. సాధ్యమైన అన్ని సహాయాలను అందించడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే భారత్‌లోనూ భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. రిక్టర్ స్కేల్‌పై 6.8గా నమోదైనట్లుగా తెలుస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ సహా కోల్‌కతా, రాంచీ, త్రిపుర, అస్సాం, పాట్నాలో భూప్రకంపనలు సంభవించాయి. దీంతో భయంతో విద్యార్థులు, అధ్యాపకులు క్లాస్ రూమ్‌లోంచి బయటకు వచ్చేశారు. అలాగే అధికారులు కూడా కార్యాలయాల్లోంచి ఇళ్లకు వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## శనగ రైతులకు కేంద్రం ఊరట

### దిగుమతులపై 10శాతం సుంకం విధింపు

**న్యూఢిల్లీ, మార్చి 28 :** దేశంలో ఈ ఏడాది దేశీ శనగ ఉత్పత్తి 11.5 మిలియన్ టన్నులకు చేరుకోవడంతో కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోంది. దేశంలోని రైతులకు మేలు జరిగేలా ఏప్రిల్ 1 నుంచి వచ్చే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి శనగ దిగుమతులపై 10శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తూ నిర్ణయం తీసుకుంది. గత సంవత్సరం పాటించిన సుంకం లేని విధానాన్ని రద్దు చేస్తూ కేంద్రం చర్యలు చేపట్టింది. బదులుగా ఏప్రిల్ 1 నుండి దేశీ శనగపై 10దిగుమతి సుంకాన్ని తిరిగి ప్రవేశపెట్టింది. దేశంలో ఈ ఏడాది చనగ ఉత్పత్తి 11.5 మిలియన్ టన్నులకు పెరుగుతుందని అంచనా వేస్తున్నందున ఈ చర్యలకు ఉపక్రమించాల్సి వచ్చిందని కేంద్రం చెబుతోంది. ఏప్రిల్ 1 నుండి అమలులోకి వచ్చేలా దేశీ శనగ పై ప్రభుత్వం 10శాతం దిగుమతి సుంకాన్ని విధించింది. గత సంవత్సరం మే నెలలో, దేశీయ లభ్యతను పెంచడానికి, ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం సుంకం లేని శనగ దిగుమతిని అనుమతించింది. దిగుమతి సుంకం మినహాయింపు మార్చి 31, 2025 వరకు వర్తిస్తుంది. ఈ మార్పుకు సంబంధించి ఈ నెల 27న ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ డేటా ప్రకారం, చనగ ఉత్పత్తి 2024-25లో 11.5 మిలియన్ టన్నులుగా అంచనా వేశారు. అయితే, ఇది గతేడాది ఇది 11 మిలియన్ టన్నులు.

## భద్రాచలం ప్రభుత్వా దవాఖాన వద్ద ఉద్రిక్తత

### భవనం కూలిన ఘటనలో న్యాయం చేయాలని ఆందోళన



**ప్రజానావ, భద్రాచలం :** భవనం కుప్పకూలిన ఘటనలో శిథిలాల కిందపడి చనిపోయిన మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కుల సంఘాలు, వామపక్ష, కుల సంఘా నాయకులు, తాపీమేస్త్రి ఉపేందర్ బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే మృతదేహాలకు పోస్టుమార్టం చేయాలని ప్రభుత్వ దవాఖాన మార్చురీ ఎదుట ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు హాస్పిటల్‌కు చేరుకున్నారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శ్రీపతి సేవా ట్రస్టు పేరిట భద్రాచలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఆరు అంతస్థుల భవనం బుధవారం కూలిన ఘటన విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. శిథిలాల కింద చిక్కుకుని తాపీమేస్త్రి ఉపేందర్, కార్మికుడు కామేశ్వర్‌రావు మృతిచెందారు. గురువారం శిథిలాల్లో చిక్కుకుపోయిన తాపీమేస్త్రి కామేశ్వర్‌రావును అధికారులు ప్రాణాలతో బయటకుతీశారు. కానీ అప్పటికే కాలు, చెయ్యి నుజ్జునుజ్జయి, తీవ్ర రక్తస్రావం జరిగిన కామేశ్వర్‌రావు దవాఖానకు తరలించిన వెంటనే ప్రాణాలు వదిలాడు. శుక్రవారం ఉదయం ఉపేందర్ మృతదేహాన్ని శిథిలాల కిందినుంచి రెస్క్యూ సిబ్బంది వెలికి తీసింది. పోస్టుమార్టం అనంతరం ఉపేందర్ డెడ్‌బాడీని ఆయన కుటుంబ సభ్యులకు అందజేయనున్నారు.

## మరోమారు ప్రధాని మోడీ విదేశీ పర్యటన

**న్యూఢిల్లీ, మార్చి 28:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వచ్చేనెల ఏప్రిల్లో విదేశీ పర్యటనకు థాయ్‌లాండ్, శ్రీలంక దేశాలకు వెళ్లనున్నారు. ఏప్రిల్ 3-4 తేదీల్లో థారులాండ్ ఆతిథ్యం ఇస్తున్న ఆరవ బిఐఎంఎస్‌టిఇసి (శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనగడానికి బ్యాంకాక్‌లో పర్యటించనున్నట్లు- భారత విదేశాంగ మంత్రిత్వశాఖ శుక్రవారం వెల్లడించింది. అనంతరం మోడీ ఏప్రిల్ 4-6 వరకు శ్రీలంకలో పర్యటించనున్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై కొలంబోలో శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకతో మోడీ చర్చలు జరపున్నట్లు- భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ రెండు దేశాల పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైనట్లు- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ముందుగా ఏప్రిల్ 3 - 4 తేదీల్లో ప్రధాని థాయ్‌లాండ్‌లో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రఆహ్వానం మేరకు ఆ దేశ పర్యటనకు వెళ్లబోతున్నారు. ఈ సందర్భంగా పేటోంగ్టార్న్‌తో భేటీ కానున్నారు. ఏప్రిల్ 4వ తేదీన బ్యాంకాక్‌లో జరగనున్న 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్'కూటమి సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టు-బడులు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలంపై దేశాధినేతలతో చర్చించనున్నారు. ఆ తర్వాత థాయ్‌లాండ్ పర్యటనను ముగించుకొని ప్రధాని ఏప్రిల్ 4న శ్రీలంక వెళతారు. ఏప్రిల్ 6వ తేదీ వరకూ ఆ దేశంలో పర్యటించనున్నారు. ఆ దేశాధ్యక్షుడు అనురకుమార దిసనాయకే గతేడాది భారత్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ఆహ్వానం మేరకు మోదీ శ్రీలంక పర్యటనకు వెళ్లబోతున్నారు. మోదీ తన పర్యటనలో రెండు దేశాల మధ్య కుదిరిన పలు ఒప్పందాలపై చర్చించనున్నారు.

